
మెదక్ జిల్లా కూచన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి ప్రచారం


జిల్లా హవేళీఘనపూర్ మండలం ముత్తయికోట గ్రామంలో ప్రచారం

# కాంగ్రెస్‌కు ఓటేస్తే అధోగతి

- ఇంటింటికీ సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు
- ఇన్ని రోజులు మంచి చెడులు చూడని మైనంపల్లి
- ఎన్నికలప్పుడే మెదక్ ప్రజలు గుర్తొచ్చారా?
- కాంగ్రెస్ రైతు భరోసా పేరుతో మోసం చేస్తున్నది
- మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి


కూచన్‌పల్లి గ్రామంలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 5: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణ అధోగతి పాలవుతుందని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే కేసీఆర్ తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలుపుతారని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హవేళీఘనపూర్ మండలంలోని తొగిట, మద్దుల్‌వాయి, ముత్తాయికోట, కూచన్‌పల్లి, ముత్తాయిపల్లి, ఫరీద్‌పూర్, వాడి, రాజ్‌పేట్, కొత్తపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు బోనాలు, డప్పుచప్పుళ్లతో మహిళలు మంగళహారతులు, కోలాటంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ న్యాయం చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ రైతు భరోసా అని రూ.15,000 అంటున్నారు, కానీ కేసీఆర్ ఎకరానికి రూ.16,000 ఇస్తామని అంటున్నారని పేర్కొన్నారు. ఝూటామాటల కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని, ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. సీఎం కేసీఆర్ వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.5000 పింఛను ఇస్తామని తెలిపారన్నారు. మెదక్ తనకు సెట్ కాదని చెప్పి మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరికి వెళ్లాడని, 13 ఏండ్ల తర్వాత మెదక్ ఎందుకు గుర్తుకొచ్చిందని ప్రశ్నించారు. ఇన్ని రోజులు మెదక్ ప్రజల మంచి చెడులను చూడని మైనంపల్లి అసెంబ్లీ ఎన్నికలు రాగానే కొడుకు కోసం మెదక్ నియోజవర్గానికి వచ్చిండన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తామని అంటున్నారని, కాని సీఎం కేసీఆర్ 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్నారన్నారు. ప్రజలు ఆలోచించి మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఆమె కోరారు.

# గజ్వేల్‌లో కేసీఆర్‌దే ఘన విజయం

- భారీ మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించాలి
- ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించాలి
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డి
- పలు గ్రామాల్లో భారీ ర్యాలీ, ఇంటింటా ప్రచారం


మనోహరాబాద్‌లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు, హాజరైన ప్రజలు

మనోహరాబాద్, నవంబర్ 5: గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ గెలుపొందడం ఖాయమని, భారీ మెజార్టీని కేసీఆర్‌కు అందివ్వాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి, కొనాయిపల్లి (పీటీ), ధర్మరాజుపల్లి, మనోహరాబాద్, కాళ్లకల్ గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీ, రోడ్‌షో, ఇంటింటా ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతి గ్రామంలో


బైక్ ర్యాలీలో ఎలక్షన్‌రెడ్డి

ప్రజలు బీఆర్‌ఎస్ శ్రేణులకు బ్రహ్మరథం పట్టారు. డప్పుచప్పుళ్లతో, ఆడపడుచులు బోనాలతో సందడి చేశారు. పలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏండ్లు కాంగ్రెస్, బీజేపీ పాలనలో తెలంగాణను ఆగం చేశారని, ఎన్నో కష్టాలు పడ్డామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేండ్లలో అభివృద్ధి పథంలో నిలిపారని కొనియాడారు. తెలంగాణ పల్లెల్లో తాగడానికి నీళ్లులేక అల్లాడిపోయామని గుర్తు చేశారు. కేసీఆర్ ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి ఆడపడుచుల నీటి కష్టాలను తీర్చారన్నారు. బోరుబావుల వద్ద కరెంట్ లేక రైతులు పడిన అవస్థలు వర్ణణాతీతమన్నారు. నేడు తెలంగాణ పండించిన పంట దేశానికే అన్నపూర్ణగా మారిందన్నారు. వడ్లు కొనమని కేంద్రం మొండికేస్తే రైతులకు నష్టం కలగకుండా తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. అన్ని సర్వేలు బీఆర్‌ఎస్ గెలుస్తుందని తేల్చిచెబుతున్నాయన్నారు. ఐదేండ్లకోసారి ఎన్నికల సమయంలో మోసపూరిత మాటలతో ఓట్లు అడుక్కునే వారిని నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్, మండలాధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, ఎంపీపీ పురం నవనీతారవి ముదిరాజ్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, సర్పంచ్‌లు నాగభూషణం, ప్రభావతి నర్సింహులు ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు ధర్మేందర్, వెంకట్, మహేందర్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్ ముదిరాజ్, పెంటాగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, భిక్షపతి, నాగిరెడ్డి, జావిద్‌పాషా, ఇర్ఫాన్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యయ వివరాలు నమోదు చేయాలి

- ప్రతి అభ్యర్థి బ్యాంకు కొత్త ఖాతా తెరవాలి
- జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్
- మెదక్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పరిశీలన

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): నామినేషన్ వేసినప్పటి నుంచి ప్రతి అభ్యర్థి వ్యయ వివరాలు నమోదు చేయాలని మెదక్ జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మెదక్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెదక్ రిటర్నింగ్ అధికారి ఆఫీసును వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేసినప్పటి నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు లెక్కలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. ప్రతి అభ్యర్థి బ్యాంకులో కొత్త ఖాతా తెరవాలన్నారు. ఏఈవో, అకౌంటింగ్ టీంలకు తగు సూచనలు, సలహాలు అందించారు. అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెంచాలని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉన్న వసతులు, సదుపాయాలు, కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీవీ మానిటరింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో లైజన్ అధికారి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కృష్ణ మూర్తి, రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, అకౌంటింగ్ టీం, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రాలకు నెలవుగా తెలంగాణ

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి


చెన్నాపూర్‌లో రాజస్థాన్ వాసుల షాపును ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, నవంబర్ 5: తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు కేంద్రంగా మారిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చి మాతాజీ హార్డ్‌వేర్ షాపును ఏర్పాటు చేసుకోగా, సునీతాలక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఆమె వెంట సర్పంచ్ బోళ్ల భారతీ భిక్షపతి, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మండల పారిశుద్ధ్య కమిటీ చైర్మన్ బోళ్ల ఆంజనేయులు, నాయకులు రాంచందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యుద్ధంరెడ్డి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, బుచ్చిరెడ్డి, కలురాం చౌహాన్, రమేశ్ సిర్వి తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో భక్తజన సందోహం


పూజలందుకుంటున్న వనదుర్గామాత

పాపన్నపేట్, నవంబర్5: ఏడుపాయల పుణ్య క్షేత్రంలలోని వనదుర్గా మాత సన్నిధిలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. పలు ప్రాంతాల నుంచి ఏడుపాయల చేరుకున్న భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దుర్గామాతను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నర్సింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఆలయం ఎదుట భక్తుల సందడి